క్లుప్తంగా

టీఆర్‌టీ అవకాశం కల్పించాలి

నారాయణపేట రూరల్: దేశ వ్యాప్తంగా వివిధ హిందీ బోధన సంస్థల ద్వారా విద్వాన్, విశారద కోర్సుల అనంతరం హిందీ పండిత్ ట్రైనింగ్ పూర్తిచేసిన అభ్యర్థులకు టీఆర్‌టీ రాసుకునే అవకాశాన్ని కల్పించాలని ఆ సంఘం నాయకులు నర్సింహ డిమాండ్ చేశారు. 2015లో ఆయా కోర్సులను డిగ్రీతో సమానంగా భావించి పండిత్ ట్రైనింగ్‌కు అర్హత కల్పించారని, 2012లో సైతం హెచ్‌పీటీతో హిందీ టీచర్లుగా నియమితులయ్యారని గుర్తు చేశారు. దాదాపు 25వేల మంది అభ్యర్థుల భవితవ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, వెంటనే సానుకూలంగా నిర్ణయం తెలపాలని కోరారు. సమావేశంలో అరవింద్, వెంకటేష్, బాలకృష్ణ, తులసీదాస్‌మనీల, రాజశ్రీ తదితరులు ఉన్నారు.

గుంతలమయంగా బీటీ రోడ్డు



మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ గేట్ నుంచి మందిపల్లి వరకు దాదాపుగా 12కిలో మీటర్లు బీటీ రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనాదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో గుంతలో వర్షపునీరు నిలుస్తుండటంతో గుంతలు కన్పించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణం అంటేనే జనం జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సమస్య పరిష్కారించాలని ప్రజలు కోరుతున్నారు.

ముమ్మరంగా ప్రచారం

మరికల్ మండలంలోని గురువారం బీజేపీ నాయకులు ఆయా గ్రామాల్లో ఇంటింటీకి తిరిగి ఎమ్మెల్యే అభ్యర్థి రతంగపాండురెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నర్సన్‌గౌడ్, వేణు, భాస్కర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

- తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒకసారి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే అభ్యర్థి పర్ణికారెడ్డి అన్నారు. గురువారం మరికల్‌లో ఆయా గ్రామాల్లో ఆమె ప్రచారం చేసి మాట్లాడారు.. కాంగ్రెస్ అధికారంలో వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు.
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని గెలిపించాలని ఏఐసీసీ నియోజకవర్గ ఇన్‌చార్జి సెల్వ రాజ్ ప్రజలను కోరారు. గురువారం మద్దూర్‌లో రేవంత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేసి మాట్లాడారు..
- కోస్గి మున్సిపల్ పరిధిలోని గురువారం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేసి మాట్లాడారు.. నియోజకవర్గ అభివృద్ధి పనులు చూసి మరోమారు ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు.

స్వయం ఉపాధికే మొగ్గు



మాగనూర్: ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థిక స్థోమత సరిపోకపోవడం, చదివినా ప్రభుత ఉద్యోగాలు వస్తాయనే నమ్మకం లేకపోవడం, కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడడం వంటివి చూసిన యువత.. తమ కుటుంబానికి భారం కాకుడదనే సంకల్పంతో స్వయం ఉపాధిపై దృష్టి సారించారు. రోజు మొత్తం తమ రెక్కల కష్టంపై పలు రంగాల్లో రాణిస్తూ.. వచ్చిన మొత్తంలో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. బైక్, ఆటో, టీవీ, సెల్ మెకానిక్‌తో పాటు వెల్డింగ్, పైపుల రిపేర్ వంటివి కాకుండా ఎలక్ట్రీషియన్, ద్విచక్రవాహనాలు, ఆటోలు, లారీలు వంటి వాహనాలకు పంచర్లు వేయడం పనుల్లో నైపుణ్యం సాధిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు మక్తల్ పట్టణ కేంద్రంలో సీనియర్ మెకానిక్‌ల వద్ద పనులో చేరి యువకులు రాణిస్తున్నారు.

ప్రమాదకరంగా మలుపు

మరికల్: మండల కేంద్రం నుంచి కన్మనూర్, నర్వ వెళ్లే రహదారిపై ఉన్న మలుపుల వద్ద సూచికబోర్డులు లేక కొత్తగా వచ్చే వాహనదారులకు భయపెట్టిస్తుంది. మరికల్, కన్మనూర్ గ్రామాల మధ్యన ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. దీంతో తరచుగా బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుమలుపు వద్ద అధికారులు స్పీడ్ బ్రేకర్లను వేయించి, సూచికబోర్డులు ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

బీజేపీ జెండా ఎగురవేద్దాం



మహిళా కార్యకర్తలతో ముచ్చటిస్తున్న మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి

మక్తల్/ఊట్కూర్: నియోజకవర్గంలో బీజేపీ జెండాను ఎగరవేస్తామని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఊట్కూర్ మండలంలోని పులిమామిడి, బిజ్వార్, లక్ష్మీపల్లి, మెగ్గుంపూర్, అవుసలోనినపల్లి ఇంటింటి ప్రచారం చేశారు. మక్తల్ పట్టణంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య జలంధర్‌రెడ్డికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి నిత్యం కృషి చేస్తుందన్నారు. బీజేపీపై ప్రజలకు నమ్మకం ఉందని, ఈ సారి ఓటుతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెబుతారన్నారు. అదేవిధంగా మక్తల్ పట్టణంలో జలంధర్‌రెడ్డి సతీమణి పద్మజారెడ్డి జోరుగా ప్రచారం చేస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్‌పర్సన్ అఖిలారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, అసెంబ్లీ కన్వీనర్ కర్నిస్వామి, ఈసరి నాగప్ప, కౌన్సిలర్లు కౌసల్య, అర్చన, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, రంగప్ప, తిమ్మప్ప, రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, నాగప్ప, కుర్వలింగం, ద్యావరింటి నర్సింహారెడ్డి, ఊట్కూర్ మండల అధ్యక్షుడు రమేశ్, గీతా సెల్ జిల్లా కన్వీనర్ విజయన్‌గౌడ్, మహిళ మోర్చ జిల్లా నాయకురాలు జ్యోతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పులిమామిడిలో జలంధర్‌రెడ్డి

మాగనూర్: బీజేపీ బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో గురువారం బీజేపీ నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకుడు అశోక్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే అది ఒక్క బీజేపీతోనే సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో భీంరాజు, పరశురాం, సుమంత్, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పం.. మడమ తిప్పం

ఆత్మకూర్: మాట తప్పం.. మడమ తిప్పం.. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందటే శాసనం అని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మక్తల్ నియోజకవర్గ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మండలంలోని రేచింతల, వీరరాఘవపూర్, కత్తేపల్లి, తూంపల్లి, ఆరేపల్లి గ్రామాల్లో, ఆత్మకూర్ మున్సిపాలిటీ వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, రాష్ట్ర నాయకులు నాగరాజుగౌడ్, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరోగమంలో అభివృద్ధి

మక్తల్ నియోజకవర్గ అభివృద్ధిని ఎమ్మెల్యే చిట్టెం తిరోగమనంలోకి తీసుకొచ్చారని, కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధే తప్ప చెప్పుకోవడానికి పదేళ్ల కాలంలో ఏమి లేదని మండిపడ్డారు. ప్రజలను తన బానిసలుగా అనుకుంటున్న దొర కుటుంబం నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించి ఫామ్‌హౌజ్‌కు పంపించాలని కోరారు. వాకిటిశ్రీహరి సమక్షంలో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, అయ్యుబ్‌ఖాన్, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను, రహ్మతుల్లా, లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్, ఎస్టీడీ శ్రీను, గాలివంపు శ్రీను, అజ్మత్, ఈర్లదిన్నె శ్రీను తదితరులు ఉన్నారు.

మక్తల్: నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరిని గెలిపించాలని బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సంగంబండ, గుర్లపల్లి, గడ్డంపల్లి, అనుగొండ, అంకేన్‌పల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా మక్తల్ పట్టణంలో వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, గడ్డంపల్లి హన్మంతు, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, పెద్ద సురయ్యగౌడ్, ఆంజనేయులుగౌడ్, సిదార్ధరెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్‌యాదవ్, గోపాల్‌రెడ్డి, కావలి శ్రీహరి, మధు, గణేష్‌కుమార్, రవికుమార్, నీలప్ప పాల్గొన్నారు.

అమరచింత: వాకిటి శ్రీహరి గెలుపు కోసం పట్టణంలోని పది వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహంకాళి విష్ణు, తిరుమలేష్, పోసిరిగారి విష్ణు, తౌఫిక్, విష్ణువర్ధన్‌యాదవ్, జుబేర్ అహ్మద్, ఘోరీ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో ప్రచారం చేస్తున్న అభ్యర్థి వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న సీతాదయాకర్‌రెడ్డి

ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగం

మద్దూరు: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌స్టేషన్ వరకు రాని వృద్ధులకు, వికలాంగులకు ఇంటినుంచే ఓటుహక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. గురువారం మద్దూరు, కొత్తపల్లి మండలాల్లో ఎన్నికల సిబ్బంది వారి ఇంటి వద్దుకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రక్రియను పూర్తిచేశారు. మండలంలోని 14మందిని గుర్తించగా వారిలో 12మంది నుంచి పోస్టల్ బ్యాలెట్ వేయించారు. అలాగే కొత్తపల్లి మండలంలో 12మందిని గుర్తించగా అందరిచే పోస్టల్ బ్యాలెట్ వేయించినట్లు రెండు మండలాల తహసీల్దార్లు జయరాం, అనిల్‌కుమార్ తెలిపారు. వీటిని కొడంగల్ ఆర్వో కార్యాలయానికి పంపినట్లు వారు పేర్కొన్నారు.



పోస్టల్ బ్యాలెట్ వేయించుకుంటున్న అధికారులు

కొత్త పథకాలకు శ్రీకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట/మరికల్: దేశంలో ఎక్కడ లేని విధంగా వ్యవసాయరంగానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలిచారని.. మళ్లీ అధికారంలోకి కారు.. సారు.. సర్కారు వస్తేనే కరెంట్ సాధ్యమవుతుందని బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నారాయణపేట మండలంలోని కోటకొండ, జాజాపూర్, పేరపళ్ల, కొల్లంపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటుచేసిన రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. వ్యవసాయానికి 24గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తుంటే, మూడు గంటల కరెంట్ సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడడం చూస్తే రైతులపై ఎంత చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతుందన్నారు. రైతు సంక్షేమానికి అమలవుతున్న రైతుబంధును యాసంగిలో ఇవ్వకుండా ఆపేయాలని కాంగ్రెస్ నేతలు ఈసీకి ఫిర్యాదు చేయడాన్ని ఒక్కసారి రైతులు ఆలోచించాలన్నారు. సీఎం మరిన్ని కొత్త పథకాలకు శ్రీకారం చుట్టారని వివరించారు. 93 లక్షల మంది నిరుపేద కుటుంబాలకు రైతుబీమా తరహాల్లో ఇంటింటికి బీమా.. కేసీఆర్ ధీమా పథకాన్ని సీఎం ప్రవేశపెట్టనున్నరన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారందరికీ సన్నబియ్యం, రూ. 400లకే వంట గ్యాస్ సిలిండర్, ఆసరా పింఛన్ తదితర పథకాలను అమలుచేస్తామన్నారు.

కాంగ్రెస్‌వి నీచరాజకీయాలు

'నేను ఎన్నో రాజకీయాలు చూశాను.. కానీ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఇలాంటి నీచ రాజకీయాలు ఇంత వరకు చూడలేదు' అని సరాఫ్ క్రిష్ణ ముదిరాజ్ అన్నారు. నారాయణపేట మండలంలోని పేరపళ్ల గ్రామంలో ఎమ్మెల్యే చేపట్టిన ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, జాయమ్మ చెరువు నీళ్ల నింపడానికి ఎమ్మెల్యే చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. ఈ నెల 30న మరోమారు ఎస్‌ఆర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బీజేపీ, కాంగ్రెస్‌లవి మాయమాటలు

ఎన్నికల వేళ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు చెబుతున్న మాయమాటలను ప్రజలు నమ్మోద్దని నారాయణపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి కుమార్తె నందిక రెడ్డి ఓటర్లను కోరారు. జిల్లా కేంద్రంలోని 12,13 వార్డులో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

దామరగిద్ద మండలంలోని చాకలోనిపల్లికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎస్. రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని గురువారం మరికల్ మండలంలోని ఆయా గ్రామాల్లో నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. తిరిగి మూడోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాజేందర్‌రెడ్డిని గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుపతయ్య, రాజేష్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేఖ, రాములు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

ఘనంగా సత్యసాయి జయంతి



ఆత్మకూర్‌లో సాయిబాబా చిత్రపటానికి పూజలుచేస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతిని గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు ఆలయంలో ఓంకారంతో పాటు భక్తిశ్రద్ధలతో సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారి చిత్రపటంతో పట్టణ పురవీధుల గుండా భజనలు చేస్తూ నగర సంకీర్తన నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రశాంతి పతాకావిష్కరణ, సామూహిక సత్యసాయి వ్రతాలు కొనసాగాయి. జిల్లా ఆస్పత్రిలో సాయి పేరుతో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేపట్టి ఆలయ పరిసరాల్లో బీదలకు చీరల పంపిణీ చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అష్టోత్తర శతనామావళి, స్వామివారి డోళారోహణం కనుల పండువగా చేపట్టారు. కార్యక్రమంలో చిట్టెం మాధవరెడ్డి, మల్లికార్జున్, గోపీనాథ్, శివరాజ్, భక్తులు పాల్గొన్నారు.

ఊట్కూర్: మండలంలోని గురువారం శ్రీ సత్యసాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాశ్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సేవాసమితి సభ్యుడు విశ్వనాథ్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్కోటి నారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, జగదీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: భగవాన్ సత్యసాయిబాబా జయంతిని పట్టణంలోని సాయి మందిరంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5గంటలకు ఓంకార సుప్రభాతం, జ్యోతులచే పురవీధుల గుండా ర్యాలీ తీశారు. ఉదయం 6.30గంటలకు పతాకావిష్కరణ, 8గంటలకు సర్వధర్మ పతాకావిష్కరణ, 9గంటలకు బాబా వారి వ్రతకల్పం, మధ్యాహ్నం అన్నదానం, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వై.తిప్పారెడ్డి, వేణుగోపాల్, రఘు, రమేష్, నీలేష్, ముక్తేశ్వర్, రామక్రిష్ణ, రవీందర్‌రెడ్డి, నవీన్, నాగరాజు, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూర్‌లో రోగులకు పండ్లు పంపిణీచేస్తున్న నాయకులు

దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

బాలానగర్: అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేక కొందరు నాయకులు తనను హత్య చేయించడానికి ప్రయత్నం చేశారని సేవాలాల్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. గురువారం పెద్దాయపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు రోజుల క్రితం తన కారును టిప్పర్‌తో గుద్దించేందుకు యతిన్చారని ఆరోపించారు. విషయంపై ఫిర్యాదు చేసినట్లు వివరించారు. హత్య చేయడానికి సుపారీ ఇచ్చిన వారిపై, దాడి చేయడానికి కత్తులతో వెంబడించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఓ పోలీసు అధికారి హస్తం కూడా ఉందని ఆరోపించారు. విషయంపై పోలీసులదే బాధ్యత అని.. మరోమారు ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని వివరించారు.

మట్టి రోడ్ల దశ మారేనా?

దామరగిద్ద: గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి మౌలిక సదుపాయాలు ప్రధానమైన రోడ్డు సౌకర్యం ఎంతో కీలకం. కాగా నేటికి పలుగ్రామాలకు మట్టిరోడ్ల దశ మారకపోవడంతో ప్రజలు పాట్లు పడుతున్నారు. మండలంలోని దాదాపు 30పంచాయతీలో మారుముల తాండాలు గ్రామ పంచాయతీలకు మొదలు 27పంచాయతీలకు రోడ్డు సదుపాయం కల్పించారు. కాగా మండల కేంద్రమైన దామరగిద్దకు లింగారెడ్డిపల్లి, పిడెంపల్లి గ్రామాలు ప్రధాన రోడ్డునుంచి నేటికి బీటీరోడ్డు సదుపాయానికి నోచుకోవడంలేదు. గతఏడాది క్రితం రూ. 90లక్షల సీఆర్‌ఆర్ నిధులతో బీటీ నిర్మాణానికి నిధులు మంజూరైంది.

తనిఖీలో మద్యం, నగదు పట్టివేత



పోలీసులు అదుపులోకి తీసుకున్న మద్యం

గద్వాల క్రైం: మద్యం తీసుకెళ్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. గురువారం సాయంత్రం గద్వాల మండలం పూ దూరుకు చెందిన కృష్ణ రూ.30 వేల విలువ గల మద్యం తీసుకెళ్తున్నట్లు సమాచారం మేరకు పట్టణ శివారులో తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అలంపూర్: తనిఖీల్లో మద్యం పట్టుబడినట్లు ఉండవెల్లి ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. అలంపూర్ చౌరస్తా నుంచి అలంపూర్‌కు వెళ్లే మార్గంలో తనిఖీ నిర్వహించారు. కర్నూల్ జిల్లా మునగాలపాడుకు చెందిన మద్దిలేటిగౌడ్ బైక్‌ను తనిఖీ చేయగా అతని వద్ద 33క్వాటర్ బాటిళ్లు లభించినట్లు తెలిపారు. 5.9లీటర్ల మద్యం విలువ రూ.6900 ఉంటుందని పేర్కొన్నారు. మద్యంతో పాటు బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: కారులో తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఇటిక్యాల ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. పెద్దదిన్నెకు చెందిన బాలేశ్వరుడు, జైనుద్దీన్‌లు కారులో పొగాకు కంపెనీ నుంచి పెద్దదిన్నె వైపు వెళ్తుండగా, మునుగాల స్టేజీ సమీపంలో పోలీసులు తనిఖీ చేశారు. కారులో రెండు కాటన్ల మద్యం 17.28 లీటర్ల (విలువ రూ. 19,008) పట్టుకున్నట్లు తెలిపారు. మద్యంతో పాటు కారును సీజ్ చేసి పీఎస్‌కు తరలించి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మానవపాడు: కొర్విపాడు స్టేజీ వద్ద కర్నూల్ బస్సు కోసం వేచి చూస్తున్న వ్యక్తిని పోలీసులు తనిఖీ చేసి రూ.2 లక్షలు పట్టుకున్నట్లు ఎస్ రాములు గురువారం తెలిపారు. వ్యక్తి తమిళనాడు రాష్ట్రం మదురైకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. సరైన పత్రాలు తీసుకుని వస్తే ఫిర్యాదు కమిటీ ముందు సమర్పిస్తామని తెలిపారు.

మల్దకల్: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా మల్దకల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెల్లవారు జామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీకి ఆరుగురు నాలుగు ద్విచక్ర వాహనాలపై మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. మద్యంతో పాటు 4 ద్వి చక్ర వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. మద్యం విలువ రూ.లక్షా 47 వేలు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గట్టు: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బల్గెర గ్రామ శివారులో ఎక్సైజ్ ఎస్‌ఐ రాజేందర్ బృందం మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్ తెలిపారు. ఎక్సైజ్ సీఐ కథనం మేరకు.. బుధవారం రాత్రి గట్టుకు చెందిన గురునాయుడు, మిట్టదొడ్డికి చెందిన మారెప్పలు అక్రమంగా ద్విచక్ర వాహనంపై మద్యం సీసాలను తరలిస్తుండగా, తనిఖీలో భాగంగా వారిని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అయిజ: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం రాత్రి మండలంలోని చిన్నతాండ్రపాడు చౌరస్తాలో ఎక్సైజ్ అధికారులు రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 25.9 లీటర్ల విస్కీని పట్టుకున్నారు. మద్యంతో పాటు మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని వేణిసోంపురానికి చెందిన లక్ష్మన్న, చిన్నతాండ్రపాడుకు చెందిన ఎర్రన్న, సంధ్యపోగు మద్దిలేటిలపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్ తెలిపారు.